క్లుప్తంగా

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణంలో బుధవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. కౌన్సిలర్ సంపత్, స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్ సురేందర్, అజయ్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్, రాజు, శంకర్ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో చురుకుగా పనిచేయాలి


బీఎస్పీలో చేరుతున్న యువకులు

ఓదెల: గ్రామాల్లో బూత్‌స్థాయిలను పటిష్టం చేయాలని, అప్పుడే బహుజన రాజ్యం సాధ్యమవుతుందని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని గోపరపల్లె, గూడెం గ్రామాల్లో బుధవారం మహిళలు, యువకులు పెద్ద ఎత్తున బీఎస్పీలో చేరారు. అనంతరం ఉష మాట్లాడుతూ మరో ఐదునెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయని, ప్రతి ఒక్క కార్యకర్త గ్రామస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. అనంతరం కనగర్తి గ్రామంలో బీరప్ప అమరావతి కల్యాణ మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్న, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సాత్తూరి అనిల్, కోశాధికారి ఎండీ రియాజ్, మండల అధ్యక్షుడు పల్లె ప్రశాంత్, నాయకులు మహేశ్, శ్రీనివాస్, వహీద్, అభిరామ్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌పై స్పెషల్ డ్రైవ్


చెట్లపొదలు తొలగిస్తున్న సిబ్బంది

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం స్వచ్ఛభారత్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మెయిన్‌రోడ్డు, కృష్ణాలయం, రామాలయం, హైస్కూల్, బస్టాండ్, పద్మశాలి వీధుల్లో పారిశుధ్య కార్మికులు చెత్తచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. అంగడి బజారులో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పొక్లయిన్‌తో తొలగించారు. ఎంపీడీవో రామ్మోహన్ చారి, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, ఏపీవో మంజుల, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌గౌడ్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్: ఇళ్లలో ఉన్న చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ప్రజలను కోరారు. పట్టణంలోని పదో వార్డులో బుధవారం ఆయన ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి పొడి చెత్తను వేరు చేసి ఆటో రిక్షా వచ్చినప్పుడు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్ అరుణ, నాయకుడు బాపూరావు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలోని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార లిమిటెడ్ (విజయ డెయిరీ) ఆధ్వర్యంలో మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన పాడి రైతు తిరుపతి కూతురు పెళ్లికి బుధవారం రూ.5,116 చెక్కును అందించారు. సర్పంచ్ సాగర్‌రావు, డెయిరీ ఇన్‌చార్జి మేనేజర్ సురేశ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల, ఇందుర్తి, శానగొండ గ్రామాల్లో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. జమ్మికుంట నుంచి కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు.

వారి దారి అడ్డదారి

- టోల్ టాక్స్ తప్పించుకునేందుకు ఎస్సారెస్పీ కాలువను ఆనుకొని ప్రత్యేక రహదారి ఏర్పాటు
- నేతల ఒత్తిళ్లతో అధికారుల మౌనం
- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. ఫలితం శూన్యం



కాలువ గట్టుపై నుంచి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీ

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఫోర్‌లైన్ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్ వద్ద వాహనాల రుసుము తప్పించుకునేందుకు నూతనంగా రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ఫోర్‌లైన్ రహదారి నుంచి జీడీనగర్‌కు వెళ్లే దారిలో గల శ్రీపాదకాలనీని ఆనుకుని ఉన్న ఎస్సారెస్పీ డి–83 కాలువ గట్టు మీదుగా బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వరకు దాదాపు కిలోమీటర్ మేర రహదారి ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో స్థానికంగా నివాసముంటున్న శ్రీపాద కాలనీవాసులతో పాటు జీడీనగర్, బసంత్‌నగర్‌కు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలతో వెలువడే శబ్దం, దుమ్ము, ధూళితో తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలను నియంత్రించాలని సర్పంచ్ సూర సమ్మయ్యతో పాటు శ్రీపాదకాలనీ, జీడీనగర్ గ్రామస్తులు కలెక్టర్ సంగీత సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

లోకల్ పాసులు ఎత్తివేశారనే..

ఫోర్‌లైన్ రహదారిపై స్థానికంగా టోల్‌ప్లాజా ఏర్పాటు చేసిన సమయంలో లోకల్ లారీలకు టోల్ చెల్లింపులో కొంత మినహాయింపు ఇచ్చిన టోల్‌ప్లాజా యాజమాన్యం ప్రస్తుతం ఈ మినహాయింపును ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో లోకల్‌గా ఉన్న అన్ని లారీలకు మినహాయింపు ఇవ్వాలని స్థానిక ప్రజాప్రతినిధులు, లారీల యజమానులు టోల్‌ప్లాజా యాజమాన్యంపై రాజకీయంగా ఒత్తిడి తీసుకువచ్చారు. అయినా అందరికీ మినహాయింపు సాధ్యంకాదని వారు తేల్చి చెప్పడంతో స్థానిక లారీ యజమానులు కొత్త రహదారిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రహదారి గుండా లోకల్ లారీలతో పాటు కన్నాల క్రషర్స్ అసోషియేషన్ లారీలు, ఇతర ప్రాంతాలకు చెందిన లారీలు అధిక సంఖ్యలో వెళ్తున్నాయి.

తరచూ ప్రమాదాలు..

ఫోర్‌లైన్ రహదారి నుంచి జీడీనగర్‌కు వెళ్లేందుకు పది ఫీట్ల వెడల్పుతో బీటీ రోడ్డు ఉంది. ప్రస్తుతం జీడీనగర్, బసంత్‌నగర్ గ్రామాల ప్రజలు పెద్దపల్లి, గోదావరిఖనితో పాటు సమీప గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. టోల్ వసూళ్లు తప్పించుకునేందుకు వెళ్తున్న వాహనదారులు ఇదే బీటీ రోడ్డుగుండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వైపు మళ్లుతున్నాయి. భారీ లోడ్ వాహనాలు వెళ్లడంతో బీటీరోడ్డు దెబ్బతింటోంది. ఇటీవల బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఓవర్‌లోడ్ లారీల మూలంగా ఎస్సారెస్పీ కాలువకు ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల సంబంధితశాఖ అధికారులు వాహనాలు వెళ్లకుండా అడ్డుగా కందకం తవ్వించినప్పటికీ కొంతమంది అధికార పార్టీ నాయకులు కందకాన్ని పూడ్చివేసి మరీ వాహనాలను నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి కాలువ గట్టు మీదుగా వాహనాల రాకపోకలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

అడిగితే కేసులు పెడుతున్నారు



టోల్‌గేట్ రుసుం తప్పించుకునేందుకు మా గ్రామ బీటీ రోడ్డు గుండా వెళ్తున్న ఓవర్‌లోడ్ లారీల మూలంగా స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. తీవ్రమైన దుమ్ముతో శ్రీపాదకాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు. అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సర్పంచ్‌గా నేను ఈ చర్యను వ్యతిరేకించినందుకు నాపై అక్రమ కేసు నమోదు చేయించారు.

– సూర సమ్మయ్య, సర్పంచ్, జీడీనగర్

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


చెక్కు అందజేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరంగా మారిందన్నారు. 90మంది లబ్ధిదారులకు రూ.90.10లక్షల కల్యాలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్ధిదారులకు జీవో 59 ద్వారా మంజూరైన ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలను అందజేశారు. ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత–రమేశ్ ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక–శ్రీనివాస్, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు, రైతు సమితి మండల కోఆర్డినేటర్ బోయిని రాజమల్లయ్య, వైస్ ఎంపీపీ కోట స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సుజాత, కన్వీనర్లు లంక దాసరి రవి, శ్రీనివాస్‌రెడ్డి, తిప్పారపు దయాకర్, తహసీల్దార్ యాకన్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీరన్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే దాసరి

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలో బీరన్న పట్నాలు, ఉత్సవాల్లో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో బుధవారం ప్రారంభమైన బీరన్న ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచులు కోట దామోదర్‌రెడ్డి, పులుగు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన మొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వాల్మీకిబోయల వినతి

ఎలిగేడు: మత్స్య సహకార సంఘంలో అర్హులైన వారికి నూతన సభ్యత్వం ఇప్పించాలని కోరుతూ బుధవారం ఎలిగేడు మండల వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు బుకాల సారయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఫిషరీస్ అధికారి భాస్కర్, కలెక్టర్ సంగీత సత్యనారాయణకు నివేదికలు పంపించారు. బలంతుల ఎలప్పా, మల్లయ్య, మల్లేశం, సతీశ్, నరేశ్, శ్రీకాంత్, కొండయ్య, శంకర్, నంబయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సాధనే సీపీఎం లక్ష్యం


మాట్లాడుతున్న యాకయ్య

జ్యోతినగర్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు సాధించడమే సీపీఎం లక్ష్యమని పార్టీ జిల్లా కార్యదర్శి వై.యాకయ్య అన్నారు. రామగుండం కార్పొరేషన్ 3, 5వ డివిజన్ శివారు ప్రాంతంలోని భూపోరాట కేంద్రంలో స్థానిక నాయకులు బరిగెల వెంకటేశ్, రాజ్‌కుమార్, శశి, కృష్ణ బుధవారం వంటావార్పు ఏర్పాటు చేశారు. నిరుపేదలకు ఇళ్లస్థలాలు సాధించేవరకూ నిర్వహించే పోరాటానికి సంపూర్ణంగా మద్దతు ఉంటుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, నాగమణి, షైముద, పీర్ మహమ్మద్ జంగాలపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ


పరామర్శిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన ఆముల దిలీప్‌కుమార్ ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా బుధవారం పెద్దంపేటలోని మృతుడి కుటుంబసభ్యులను మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్ పెంట రాజేశ్, బీఆర్ఎస్ నాయకుడు పాతిపెల్లి ఎల్లయ్య ఉన్నారు.

నిరుపేదకు రూ.10వేలు అందజేత

ధర్మారం: మండలంలోని నంది మేడారం గ్రామానికి చెందిన నిరుపేద యువతి బోరె రజిత వివాహానికి ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత బుధవారం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ఎంపీటీసీలు మిట్ట తిరుపతి, కట్ట సరోజన, మార్కెట్ డైరెక్టర్ మంచర్ల లచ్చయ్య, నాయకులు మగ్గిడి రమేశ్, ధర్మాజి నరేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్క్, ఫౌంటేషన్ ప్రారంభం


ఫౌంటేషన్‌ను ప్రారంభిస్తున్న జీఎం

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో ఏర్పాటు చేసిన పబ్లిక్ పార్క్, ఫౌంటేషన్‌ను బుధవారం ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ ఎప్పుడూ వెనుకాడదన్నారు. అధికారులు శ్రీనివాసులు, రఘుపతి, కర్ణ, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, పద్మరాజు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడికి డాక్టరేట్


దామోదర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 బేస్ వర్క్‌షాపులో ఈపీ ఫిట్టర్ అండ్ మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్న జక్కుల దామోదర్‌రావు డాక్టరేట్ అవార్డుకు ఎంపికైనట్లు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ సంస్థ నిర్వాహకులు తెలిపారు. సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ అనేక సామాజిక సేవలు చేస్తున్న జక్కుల దామోదర్‌రావుకు 27న తమిళనాడులోని హూసూర్ పట్టణంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు.

29న దేవాలయ భూమి కౌలుకు వేలం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనరసింహుని వ్యవసాయ భూమి ఈనెల 29న దేవాలయ ప్రాంగణంలో కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ జితేందర్ తెలిపారు. ఆలయానికి ఉన్న ఆస్తిలో వ్యవసాయ భూమి పెద్దాపూర్ శివారు సర్వే నెంబరు 1316లో 1–35, 1319లో 1–14గుంటలు వ్యవసాయ భూమిని ఏడాది కౌలు ఇచ్చేందుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

ధూళికట్టలో 162 మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో కంటి వెలుగులో భాగంగా బుధవారం 162మందికి కంటి పరీక్షలు నిర్వహించి 8 మందికి కంటి అద్దాలు అందజేశారు. సర్పంచ్ గొల్లె కావేరి, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ పట్నాలు


ఎల్లమ్మ పట్నాల్లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ పట్నాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ పట్నం వేసి నాగవెళ్లి కార్యక్రమాన్ని బైండ్ల పూజారులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గౌడసంఘం నాయకులు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, సాయిశేఖర్‌గౌడ్, రాజు, కిరణ్, బాలయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోత పేరిట రూ.కోట్లు మింగుతున్నారు


మాట్లాడుతున్న సి.సత్యనారాయణరెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటామని గొప్పగా చెప్పుకుంటూ కేంద్రాల్లో, మిల్లుల వద్ద తూకంలో 'కోత' పెడుతూ రూ.కోట్ల అక్రమార్జనకు పాల్పడుతున్నారని ప్రజాహిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, న్యాయవాది సి.సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోనే 15లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారని, వారి లెక్కల ప్రకారమే రూ.23.17కోట్ల విలువగల ధాన్యాన్ని ఆరోపించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రూ.వేల కోట్ల దోపిడీ జరుగుతోందన్నారు. అలాగే చెరువు మట్టి తరలింపు వ్యవహారంలో మంగళవారం ప్రభుత్వ శాఖల అధికారులు 29 లారీలను సీజ్ చేశారని గుర్తు చేశారు. నిబంధనలు పాటించని వాటికి జరిమానా విధిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారని సీఎస్సార్ అన్నారు. అయితే మట్టిని చెరువుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఎత్తుకెళ్లిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు హాజీ, రవుఫ్, మునీర్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదాతలకు సర్టిఫికెట్ అందిస్తున్న రాజ్‌గోపాల్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రక్తనిధి కేంద్రంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తనిధి కేంద్రంలో నిల్వలు లేకపోవడంతో స్వచ్ఛంద శిబిరం ఏర్పాటు చేయగా పలువురు యువకులు, న్యాయవాదులు ముందుకొచ్చి రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ రాజ్‌గోపాల్ తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సులోపు గల వారు రక్తదానం చేయొచ్చన్నారు. రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని గ్రహించాలన్నారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శౌరయ్య, శ్రీకాంత్, సంపత్ రావు, మూర్తి, సత్యనారాయణ, సుధాకర్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

ధాన్యం కేంద్రాలకు లారీల తరలింపు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పుట్ట శైలజ

మంథని: లారీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధాన్యం పేరుకుపోయి కాంటాలు కావడం లేదనే ఫిర్యాదు మేరకు బుధవారం కలెక్టర్ సంగీత సత్యనారాయణ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. పెద్దపల్లి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవి, తహసీల్దార్ బండ ప్రకాశ్, ఎస్సై వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ గిరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, సీఈవో మామిడాల అశోక్‌కుమార్ రోడ్డుపై పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీలను ఆపివేశారు. లారీల కొరత కారణంగా నిల్వలు పేరుకుపోయిన కేంద్రాలకు లారీలను తరలించారు. మంథని మార్కెట్ యార్డు, ముత్తారం మండలం రామయ్యపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అడ్డా వేసి 12 లారీలను కేంద్రాలకు పంపించారు. అధికారులతో పాటు మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఉన్నారు.

అవగాహనతోనే టీబీ నియంత్రణ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జూలపల్లి: గ్రామాల్లో టీబీ వ్యాధి నియంత్రణ అవగాహనతోనే సాధ్యమని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధి నివారణపై రోగులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంపత్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే హాస్పిటల్‌కు వచ్చి పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకోవాలని సూచించారు. తేలుకుంటలోని పల్లె దవాఖానలో అనుమానిత టీబీ లక్షణాలు ఉన్న రోగుల నుంచి తెమడ పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని వెల్‌నెస్ సెంటర్లు తేలుకుంట, వడ్కాపూర్, వెంకట్రావుపల్లె, పెద్దాపూర్ కేంద్రాల పరిధిలో టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊశన్నపల్లె గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు బుధవారం రాత్రి కమ్యూనిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా సర్పంచ్, పాలకవర్గం ఆయనను సన్మానించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా డయల్ 100 వినియోగించుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే స్పందించొద్దని సూచించారు. మహిళలు, యువతులతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీటీమ్‌కు సమాచారం అందించాలన్నారు. వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సర్పంచ్ కొంకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ మానస, ఉపసర్పంచ్ తిరుపతిగౌడ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ


ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన టీటీఎస్ అంతర్గాం జట్టు

రామగుండం: సీఎం కప్–2023 క్రీడాపోటీల్లో పలు విభాగాల్లో అంతర్గాం క్రీడాకారులు జిల్లా విజేతలుగా ఎంపికయ్యారు. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి లంబాడితండాకు చెందిన ఎస్.లావణ్య 400 మీటర్ల పరుగు (మహిళలు), అదే తండాకు చెందిన వంశీ 400 మీటర్ల (పురుషులు) పరుగులో జిల్లాస్థాయి రెండో బహుమతి సాధించారు. కాగా అంతర్గాం టీటీఎస్‌కు చెందిన ఫుట్‌బాల్ జట్టు జిల్లా ప్రథమ బహుమతి సాధించింది.


ఎస్.లావణ్య


వంశీ